క్లుప్తంగా

మంత్రిని కలిసిన పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



మంత్రి ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

కోదాడరూరల్ : కోదాడ పీఏసీఎస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన ఓరుగంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సహకార సంఘం అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేసి సహకరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్ శిరంశెట్టి వెంకటేశ్వర్లు ఉన్నారు.

లోకల్ ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

మఠంపల్లి : మండల కేంద్రంలో లోకల్ ఆటో యూనియన్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుల బాలరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మెస్సీ, ప్రధాన కార్యదర్శిగా గురువయ్య, కార్యదర్శిగా నాగులు, కోశాధికారిగా నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వర్లు, మట్టయ్య, దావీదు, జనార్దన్, బాలాజీ, శంకర్, తిరుపయ్య, నాగేంద్రబాబు, దర్శనం, తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం బాలరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వైభవంగా నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న మహిళలు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో మార్చి 20న మూలమూర్తుల ప్రతిష్ఠ సందర్భంగా మహిళా భక్తులు మంగళవారం శ్రీమన్నారాయణ కాలనీలో వైభవంగా నగర సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా పఠిస్తూ, కోలాటాల ప్రదర్శన, భజన కార్యక్రమం నిర్వహించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మంజూరైన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు బానోతు నాగు, భూక్యా నాగు నాయకులు పున్నా, రవీందర్, నాగార్జున, దుర్గయ్య, నర్సింహ, హనుమాన్ సింగ్, చింటు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లుట్ల వీరయ్య మృతికి సంతాపం

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లకు చెందిన ఓజో ఫౌండేషన్ చైర్మన్ రఘు తండ్రి పిల్లుట్ల వీరయ్య (72) మంగళవారం మృతి చెందారు. పలు పార్టీల నాయకులు ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో రఘు, మంజీనాయక్, శ్రీనివాస్, మట్టయ్య, నాగరాజు, బాలనాగయ్య, నరసయ్య, ప్రవీణ్, కాశయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

శ్రీరాములు మృతి తీరని లోటు



శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

కోదాడఅర్బన్ : ప్రజా సమస్యలపై తన ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్య పరిచిన విప్లవ కారుడు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోడి శ్రీరాములు మృతి అరుణోదయకు తీరనిలోటని పలువురు నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక లాల్ బంగ్లాలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కోదాడ డివిజన్ ఆధ్వర్యంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన కోడి శ్రీరాములు ఈ నెల 17న బైక్ ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నర్సింహారావు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి డి.రవి, శ్రీను, నాగయ్య, కిరణ్, చందర్‌రావు, సింహాద్రి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ జాతరకు వేళాయే

- బేతవోలులో బండ్ల పండుగకు ఏర్పాట్లు పూర్తి
- సుందరంగా ముస్తాబైన ఆలయం
- 29 నుంచి మూడు రోజులు నిర్వహణ



ముస్తాబైన బేతవోలులోని కనకదుర్గమ్మ ఆలయం

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించే కనకదుర్గమ్మ జాతర (బండ్ల పండుగ)ను ఈ నెల 29వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

1న అమ్మవారికి పూజలు, వనభోజనాలు

కాగా, శివరాత్రికి ముందు వచ్చే గురు, శుక్ర, శనివారాల్లో కనకదుర్గమ్మ జాతర జరుపుకోవడం అక్కడి ఆనవాయితీ. జాతరలో భాగంగా గురువారం రాత్రి రైతులు ప్రభబండ్లను అలంకరించి ఊరేగింపుగా ఆలయ వద్దకు తీసుకొచ్చి అక్కడ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అక్కడే బండ్లను వదలివెళ్తారు. శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించిన అనంతరం వనభోజనాలకు వెళ్తారు. శనివారం ప్రభబండ్లను ఇంటికి తీసుకుపోవడం అక్కడి ఆచారం. ఇక వివిధ పార్టీల ఆధ్వర్యంలో గ్రామంలో కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. గ్రామంలో మూడు రోజుల పాటు కోలాహలంగా ఉంటుంది. జాతర సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ సురభి రాంబాబుల ఆధ్వర్యంలో 100 మందికి పైగా పోలీస్ బలగాలతో గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

కోలాట పోటీలు, ప్రదర్శనలు ఇలా..

బేతవోలులో జాతర సందర్భంగా పార్టీల ఆధ్వర్యంలో శుక్ర, శని వారాల్లో మధ్యాహ్నం సమయంలో పోటాపోటీగా కోలాట ప్రదర్శనలు, కోలాట పోటీలు ఉంటాయి. గతంలో సూచించిన విధంగా ఆయా ప్రదేశాలలో పార్టీలు వారు కోలాట ప్రదర్శన కార్యక్రమాలు చేపట్టనున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ సెంటర్ వద్ద, బీఆర్‌ఎస్ పార్టీ వారు రథశాల సెంటర్, సీపీఐ వారు గ్రామపంచాయతీ పక్కన, సీపీఎం నాయకులు ప్రాథమిక పాఠశాల వద్ద కోలాట ప్రదర్శన నిర్వహించనున్నారు.

ఆకర్షణగా లైటింగ్ ప్రభలు

మార్చి 1వ తేదీన రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే లైటింగ్ ప్రభలు ఆకర్షణగా నిలవనున్నాయి. అదేవిధంగా డ్యాన్స్‌లు, మ్యూజికల్ లైట్లు ఏర్పాటు చేస్తారు. బీఆర్‌ఎస్ పార్టీ వారు లైటింగ్ ప్రభలు, డ్యాన్స్‌లు, సీపీఐ, సీపీఎం, బీజేపీల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

జాతీయ స్థాయి ఎడ్ల పందేలు

ఆలయం సమీపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజుల ఎడ్ల పందేలు ఉంటాయి. ఈ పోటీలు ఈ నెల 30న ప్రారంభమై మూడు రోజుల పాటు జరగనున్నాయి.

జాతరకు రానున్న ప్రముఖులు

ఈ నెల 1వ తేదీ రాత్రి జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హాజరవుతారు. బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ పార్టీల సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఆయా పార్టీల రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు కానున్నారు. మూడు రోజుల పాటు జరిగే జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ సభ్యులు, పూజారి కోరారు.

వ్యవసాయానికి 21 గంటల విద్యుత్

మునగాల : జిల్లాకు చెందిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఆదేశాల మేరకు వ్యవసాయ రంగానికి ప్రస్తుతం 21 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు మునగాల ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏడీఈ ఆర్.వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం మునగాలలోని ఏడీఈ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనివార్య కారణాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి బ్రేక్‌డౌన్ అయితే ఆ సమయాన్ని తిరిగి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ముకుందాపురం వద్ద మరో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని త్వరలో మంజూరు కానున్నట్లు తెలిపారు. మునగాల, నడిగూడెం, మోతె, అనంతగిరి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సమస్యలు తలెత్తితే ఏడీఈ ఆపరేషన్ సెల్ 9491056419, వికాస్ ట్రాన్స్‌కో ఏఈ సెల్ నంబర్ 9440813612 లకు ఫోన్ చేస్తే సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా రిజస్టర్ పెట్టినట్లు వివరించారు. సమావేశంలో స్థానిక ఏఈ వికాస్, సబ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ మారం వెంకటరెడ్డి ఉన్నారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం

హుజూర్‌నగర్ : కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం నిర్వహిస్తుందని ఈ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని అమరవీరుల భవనంలో ఎస్‌కె యాకోబ్ అధ్యక్షతన నిర్వహించిన సీఐటీయూ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లయినా కార్మిక, కర్షక, ప్రజల సమస్యలు తీర్చడంలో విఫలమైందని ఆరోపించారు. అంగన్‌వాడీ, ఆశ, గ్రామ పంచాయతీ, మధ్యాహ్నం భోజన, సిమెంట్ పరిశ్రమ కార్మికులు, గ్రామీణ హమాలీలు, ఇతర రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర చట్టం తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వి.సైదులు, అనంత ప్రకాష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఆలయానికి చేరుకున్న సీతారామచంద్రస్వామి



పల్లకీలో స్వామివారిని ఆలయానికి తీసుకొస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గట్టుపై నిర్వహించిన శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవం ముగించుకొని స్వామివారు మంగళవారం తెల్లవారుజామున పట్టణంలోని ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీతారామచంద్రస్వామిని పల్లకీలో, వేణుగోపాలస్వామి, గోదాదేవిని ఇతర వాహనాలపై ఉంచి భక్తులు బోయలుగా మారి మేళతాళాలతో పట్టణానికి తీసుకువచ్చారు. అనంతరం అర్చకులు ప్రాతః కాలార్చన చేసి ధ్వజస్తంభానికి అలంకరించిన గరుడ పటాన్ని ఉద్వాసన చేశారు. మహా పూర్ణాహుతి నిర్వహించి, మహదాశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కొండారెడ్డి, స్థానాచార్యులు దామోదరాచార్యులు, అర్చకులు నరసింహాచార్యులు మోహనాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నేరేడుచర్ల : స్వపరిపాలన వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



గరిడేపల్లి : తుంబాయిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

గరిడేపల్లి : మండల కేంద్రంలోని తుంబాయిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మానస, ఉపాధ్యాయులు బి.స్వర్ణలత, వలంటీర్ కళ, పి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలోని ప్రాథమిక పాఠశాలలో..

నేరేడుచర్ల : నేరేడుచర్లలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, హెచ్‌ఎం ఒగ్గు రమేష్, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, విజయ, భూదేవి, ఫాతిమా, శ్రీను తదితరులు ఉన్నారు.

సాగర్ నీటిని విడుదల చేయాలి

హుజూర్‌నగర్ : ఎండుతున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో బోర్లు, బావుల ఆధారంగా సుమారు 80 వేలకు పైగా ఎకరాలలో వరిపంట సాగు చేశారని, ప్రస్తుతం పంట పొట్టదశకు చేరుకుందని తెలిపారు. ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెంటనే సాగర్ నీటిని విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా, మండల, పట్టణ నాయకులు దుగ్గి బ్రహ్మం, పి.వెంకటరెడ్డి, ఆర్.మురళి, శీలం శ్రీను, పి.హుస్సేన్, యోనా, వీరస్వామి, కౌన్సిలర్ ఇందిరాల త్రివేణి, చిన్నం వీరమల్లు, డీసీసీఎస్ డైరెక్టర్ లక్ష్మీ, పి.వెంకటనారాయణ, ఆర్.వెంకన్న, నారాయణ పాల్గొన్నారు.

చేతికొచ్చే దశలో ఎండిపోతున్న పొలాలు

నేరేడుచర్ల : తాగు, సాగు నీటి అవసరాల నిమిత్తం నాగార్జునసాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు కోరారు. మంగళవారం నేరేడుచర్లలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో బోర్లు, బావుల కింద సుమారు లక్ష 50 వేల ఎకరాల వరకు వరి నాట్లు వేశారని, భూగర్భ జలాలు అడుగంటడంతో చేతికి వచ్చే దశలో పొలాలు ఎండిపోతున్నాయని, నీటిని విడుదల చేయాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, కందగంట్ల అనంత్ ప్రకాశ్, ఎల్ల సైదులు, తిరుపతయ్య, రుద్రమ్మ, నీలా రామ్మూర్తి, శ్రీను తదితరులు ఉన్నారు.

15 రోజులైనా నీటిని విడుదల చేయాలి

చిలుకూరు : సాగర్ నీటిని విడుదల చేసి వరి పొలాలను కాపాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ముర్తాల వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిలుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కనీసం 15 రోజులు అయినా సాగర్ నీళ్లు విడుదల చేస్తే పొలాలు చేతికి వస్తాయన్నారు. ఈవిషయమై జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి సాగర్ నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి నియామకంపై సంబరాలు

కోదాడ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే కె.శ్రీనివాసరెడ్డి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులు కావడం అభినందనీయమని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గింజల అప్పిరెడ్డి అన్నారు. శ్రీనివాసరెడ్డి నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం కోదాడలో ఐజేయూ ఆధ్వర్యంలో జర్నలిస్టులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఐజేయూ దాడుల నిరోధక కమిటీ జిల్లా అధ్యక్షుడు బాదె రాము, టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు అలుగూరి హరినాథ్ బాబు, ఆవుల మల్లికార్జున్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు లంకెల దశరథరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు సలిగంటి మురళి, ఉపాధ్యక్షుడు పల్లపు శ్రీనివాస్, జర్నలిస్టులు మేకపోతుల వెంకటేశ్వర్లు, చలిగంటి దామోదర్, పగడాల వాసు, శ్రీనివాస్, లావుడియా రమేష్, మిట్టపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి మండల కేంద్రంలో..

అనంతగిరి : తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా కె.శ్రీనివాసరెడ్డి నియమితులు కావడం పట్ల అనంతగిరి జర్నలిస్టులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జిల్లా అర్గనైజింగ్ సెక్రటరీ, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తూములూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గోళ్ల నరేష్ కుమార్‌లు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు తునగర్ సైదులు, బాణోతు వీరన్న, గోపతి వినోద్, గోళ్ల ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

మోతె : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై పట్టభద్రులకు అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దార్ సంఘమిత్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న పట్టభద్రులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో సాగు, తాగునీటి సమస్య



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లకుమళ్ల జ్యోతి

నేరేడుచర్ల : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో తాగు, సాగు నీటి ఎద్దడి ఏర్పడిందని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఎడమ కాలువకు నీటిని విడుదల చేస్తే భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని పెంచికల్ దిన్న ఎంపీటీసీ ఎల్లబోయిన లింగయ్య సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కల్లూరు ఎంపీటీసీ నాగవేణి తదితరులు మద్దతు తెలుపడంతో సాగర్ నీరు విడుదల చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చేతి పంపులు, పైపులైన్లు తదితర పనులకు మొదటి విడతగా రూ.17 లక్షల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్ తెలిపారు. మిషన్ భగీరథ పైపులైన్లు, ఫ్లో కంట్రోల్ వాల్‌లు తొలగిస్తే చర్యలు తీసుకుంటామని, ఇటీవల పైపులైన్లు ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఏఈ శ్రీనాథ్ వెల్లడించారు. గ్రామాల్లో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ తెలిపారు. మార్చి 3న మండల వ్యాప్తంగా 30 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగిని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, ఎంపీడీఓ సోమ సుందర్ రెడ్డి, ఎంపీఓ విజయకుమారి, ఎంపీటీసీలు, అధికారులు ఉన్నారు.

విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బా భాగ్యరెడ్డి

కోదాడఅర్బన్ : కోదాడ నియోజకవర్గంలో మార్చి 1న జరగబోయే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి కోరారు. మంగళవారం కోదాడలో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. యాత్రకు బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున హాజరయ్యేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు హనుమంతరావు, నారాయణ, సులోచన, కృష్ణయ్య, శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా మురళీధర్‌రెడ్డి



కత్రం మురళీధర్‌రెడ్డి, హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్



లచ్చిమళ్ల సందీప్‌కుమార్, ఏజీపీ



దార హరితకిరణ్, ఏజీపీ



సోము శ్రీనివాసరెడ్డి, ఏజీపీ

అనంతగిరి : హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా అనంతగిరి మండలంలోని కిష్టాపురంనకు చెందిన కత్రం మురళీధర్‌రెడ్డి నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కిష్టాపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, కత్రం మురళీధర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ జనరల్ శ్రీరామ్‌తో కలిసి పనిచేశారు. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంబంధించిన పలు కేసులను ఆయన వాదించారు. అంతేకాకుండా స్థూలంగా విద్యా, రెవెన్యూ, క్రిమినల్ కేసులను సైతం టేక్ అప్ చేసిన ఘనత ఆయన సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డికి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన చరవాణిలో కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదులుగా హుజూర్‌నగర్‌వాసులు

హుజూర్‌నగర్ : తెలంగాణ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)లుగా హుజూర్‌నగర్ వాసులు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన జాబితాలో హుజూర్‌నగర్‌కు చెందిన లచ్చిమళ్ల నాగేశ్వరరావు కుమారుడు లచ్చిమళ్ల సందీప్‌కుమార్, దారా ప్రకాష్‌రావు కుమార్తె దార హరితకిరణ్ ఉన్నారు. ఏజీపీలుగా నియమితులైన వీరికి పట్టణ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

గుడుగుంట్లపాలెం నుంచి శ్రీనివాసరెడ్డి..

పాలకవీడు : హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన సోము శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామానికి చెందిన సోము కనకారెడ్డి, గోవిందమ్మల చిన్న కుమారుడు శ్రీనివాసరెడ్డి హైకోర్టులో 12 సంవత్సరాలుగా న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. శ్రీనివాసరెడ్డి ఏజీపీగా నియామకం కావడం పట్ల మండల ప్రజలు, గ్రామస్తులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

సోమప్ప జాతరను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ పరిధిలో గల సోమప్ప దేవాలయంలో మార్చి 7వ తేదీ నుంచి 11 వరకు జరగనున్న జాతరను విజయవంతం చేయాలని తహసీల్దార్ సైదులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జాతర ఏర్పాట్లపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. వాహనాలకు పార్కింగ్ ను ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని పోలీస్ అధికారులను కోరారు. సమావేశంలో దేవాదాయ అధికారి మృత్యుంజశాస్త్రి, డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, ఎక్సైజ్ ఎస్‌ఐ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్, ఆర్‌ఐ నర్సయ్య, సోమప్ప ఆలయ పూజారి శ్రీనివాసశాస్త్రి, అధికారులు, కమిటీ సభ్యులు ఉన్నారు.

వైభవంగా నృసింహుని నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రసవత్తరంగా రక్తికట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణను తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు

నడిగూడెం: మండలంలోని వల్లాపురం రెవెన్యూ పరిధిలో గల శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో సుప్రభాతసేవ, ఆవామిత దేవతా పూజలు, వేద పారాయణం, మూలమంత్ర అనుష్టానములు, నిత్య హోమములు, జలాధివాసము, పంచగవ్య పంచామృతాధివాసము, నవకలశస్నాపన, దేవతా హోమములు, రుద్రహోమములు, ధాన్యాధివాసము, పుష్ప, శైయ్యాధివాసము, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మంగళవారం గ్రామానికి వచ్చిన మండల ట్రాన్స్‌కో ఏఈ హరీష్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు, రైతులు కోరారు. గ్రామంలో మిర్చి, వరి పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయని వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ఎస్‌కే జమీల్, నిజాం, భద్రారెడ్డి, పున్నయ్య, ట్రాన్స్‌కో సిబ్బంది నాగేశ్వరరావు, జానీ తదితరులు ఉన్నారు.

నేడు టైలర్స్ డే

హుజూర్‌నగర్ : కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవేను స్మరించుకుంటూ బుధవారం హుజూర్‌నగర్ నిర్వహించబోయే టైలర్స్‌డేను విజయవంతం చేయాలని జిల్లా టైలర్స్ యూనియన్ నాయకులు షేక్ బాజీ ఉల్లా కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎం.శ్రీరాములు, పి.సతీష్, రామారావు, సత్యనారాయణ, డేవిడ్, సోములు, శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు, సి.శ్రీనివాస్, ఎ.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

కోదాడఅర్బన్ : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో కోదాడ డిపో పరిధిలో విద్యార్థులకు అవసరమైన

సంక్షిప్త సమాచారం

రవాణా ఏర్పాట్లు చేసినట్లు కోదాడ డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలు ఆధార్ కార్డు చూపించి బస్సుల్లో పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని, సబ్సిడీ బస్‌పాస్ ఉన్న బాలురు ఉచితంగా పరీక్ష కేంద్రం వరకు ప్రయాణించవచ్చని తెలిపారు. విద్యార్థులు ఆర్టీసీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు హెల్ప్ డెస్క్ సెల్ నంబర్ 9959226302, బస్‌స్టేషన్ మేనేజర్ 7382833558లకు సంప్రదించవచ్చని తెలిపారు.

చింత శ్రీనివాసరెడ్డికి నివాళి

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండకు చెందిన స్వర్గీయ చింతా చంద్రారెడ్డి రెండవ కుమారుడు శ్రీనివాసరెడ్డి మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, వంగవీటి రామారావులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్‌లు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, లంకెల అలివేలుమంగమ్మ, నాయకులు ఎరగాని లక్ష్మయ్య, నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, మహ్మద్ రఫీ, పులి రాజారావు, బహుద్దీన్, గామయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

పలువురిపై కేసు నమోదు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో అరవిందమాత జాతర సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫొటోతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ ఇబ్రహీం మంగళవారం తెలిపారు. బత్తిని ఉషాకిరణ్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన బచ్చు రోశయ్యతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా మేకల ఉపేందర్

మోతె : బీఎస్పీ మోతె మండల అధ్యక్షుడిగా మేకల ఉపేందర్‌యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం మండలంలోని నాగయ్యగూడెంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొండ భీమయ్యగౌడ్ ఉపేందర్‌కు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కోశాధికారి పాతకొట్ల శ్రీనివాస్, మాతంగి ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

చిలుకూరు : వరంగల్‌లో ఈ నెల 28న దేశ పాలకుల విధానాలపై నేటి యువత కర్తవ్యం అనే అంశంపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం చిలుకూరులోని సీపీఐ భవన్‌లో రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనంతుల రాము, కడారు మధు, నాయకులు మాధవరపు రమేష్, రఫీ, సాయికుమార్ పాల్గొన్నారు.